శ్రవ్యనాటిక

# కలనైనా—

గోరాశాస్త్రి

[సినిమా ఆట అయిపోయి, జనం బయటి కొచ్చేస్తోంటే కలిగే రణగొణ ధ్వని-మోటార్లూ, జట్కాలూ, రిక్షా మువ్వలూ-యివన్నీ కలిసిన సంకీర్ణ ధ్వనులు.]

జానకి హమ్మయ్య, ఎలాగయితేనేం అయింది సినిమా. నేరకపోయి వచ్చాం గాని, బాబోయ్, ఎంత జనం ఎంత జనం

బావ. వాళ్లందరూ నీకోసం రాలేదు.... సినిమా కోసం వచ్చారు.

జా (వ్యంగ్యంగా) నిజం? 'కనిపెట్టేశారే! బావగారిది నిజంగా వరహాలబుర్ర! సంతో షించాంగాని - ఇప్పుడు కొంపకి చేరుకోవడం ఎలాగ? ఏవేఁ అక్కయ్యా?

లక్ష్మి మీ యిష్టం. మీరెలాగ తీసికెళితే అలాగే వస్తాను. మధ్య నాదేముంది?

బా మొదలెట్టావ్ పాట! పోనీ నీ యిష్ట మేవిఁటో చెప్పరాదూ?

ల. జానకిని అడగండి. ఏం జానకీ?

జా నన్నడిగితే హాయిగా నడిచిపోదాం. ఈ చలిగాలిలో నడుచుకుంటూ—దీపాల్నీ మనుషుల్నీ చూస్తూ—

ల బావగారితో కబుర్లు చెపుతూ—బాగానే ఉంటుంది! నీకేం? నాలుగడుగులు వేస్తే నాకు కాళ్లు లాక్కొస్తాయి నన్నేదేనా రిక్షాలోనో జట్కాలోనో పంపించి, కావలిస్తే మీరిదరూ హాయిగా నడుచుకుంటూ రండి.

బా· బాగుంది వరస. ప్రతిదానికీ అంత చిరాకు దేనికి లక్ష్మీ?

ల· ఇందులో చిరాకేముందీ? నేను నడవ లేనని చెప్పాను. అదీ తప్పే?

జా· ఏమిటే అక్కయ్యా నువ్వూ? రోజు రోజుకీ మరీ చిన్నపిల్లవి అయిపోతున్నావు. పోనీ టాక్సీలో పోదామా? హాయిగా కుదుపు లేకండా నిమిషంలో యిల్లు చేరుకోవచ్చు. ఏం బావగారూ?

బా నాకేం అభ్యంతరం లేదు.

ల· అయిన ఖర్చు చాలక అదొకటి పైపెచ్చు. మీరేం వేళాకోళం చెయ్యక్కర లేదు. నేనేం అంత మహారాణీని కాను. మీ దయుంటే రిక్షాలో పంపించండి చాలు.

జా ఇంతమాత్రానికి దయలూ దాక్షిణ్యాలూ దేనికే అక్కయ్యా? కులాసాగా సినిమా చూసి యిలా మనస్సులు పాడుచేసుకోవడం దేనికి? ప్రతి చిన్న విషయానికీ మనం యిలా ఒకర్నొకరం రక్కుకోవలసిందే?

ల నాదే పొరపాటు, అనవసరంగా మీ యిద్దరి సంతోషానికీ అడ్డొస్తున్నాను పాపం— మిమ్మల్ని యింగ్లీషు సినిమా చూడనివ్వకండా యీ పాడు హిందీ ఫిల్ముకి తీసుకొచ్చాను.

జా 'ఇప్పుడేమయిందీ? ఇంతకూ మనకి సినిమా ముఖ్యమా ముగ్గురం కలిసి కులాసాగా కాస్సేపు కాలక్షేపం చెయ్యడం ముఖ్యమా?

ల దేనికదే ముఖ్యం మీ కిద్దరికీ యీ సినిమా నచ్చలేదుగా?

బా చంపేశావు. ఈ ఫిల్ము మాకు నచ్చ లేదంటే అదికూడా నీకు అవమానమన్నమాట?

ల ఈ పిల్ము చూద్దామన్నది నేనేగదు మరీ?

జా కదు మరీ? నీ మీద కక్షకొద్దీ కావాలని ఫిల్ము బాగులేదంటున్నాం సరేనా? అక్కడికి నీకు సంతృప్తేనా? ఇక తక్కిన విషయాలు యింటిదగ్గిర మాట్లాడుకుందాం, ఎవరైనా చూస్తే నవ్వీపోతారు

ల నవ్వేవాళ్లు యిప్పటికే నవ్వుతున్నారు. ఊరుకుంటారా ఏం?

జా నవ్వుకోమను. నోరు నొప్పెట్టేవరకూ పగలబడి నవ్వుకోమను. అప్పటికీ తృప్తిలేక పోతే పీక్కి ఉరిపోసుకు ఛావమను....సరే బావగారూ... అలా కొయ్యబొమ్మలా నిలబడి పోక వెళ్ళి ఓ టాక్సీ చూడండి. నువ్వేం భయ పడకక్కయ్యా—డబ్బులు నే నిచ్చుకుంటాలే- ఇక్కడికి చాలు. ఎంత త్వరగా కొంప చేరితే అంత మంచిది

ల ఏవండీ. మీరేవంటారు?

బా అనడానికేముంది? ఎవరేమన్నా ఒకటే టాక్సీలో పోదాం పదండి (బిగ్గరగా) ఏయ్ టాక్సీ....

*     *     *

జా బావగారూ, ఇలా ఒకసారి రండి!

బా ఏం జానకీ.. అప్పుడే బట్టలు మార్చి తయారయిపోయావ్? ఏం చేస్తోంది మీ అక్కయ్య?

జా అన్నం వడ్డిస్తోంది అదో తంతు మిగిలిపోయిందిగా....అది సరేగాని బావగారూ-

బా చెప్ప బావగారూ అని ఆగిపోయావేం?

జా ఏం లేదు లెండి. భోజనాలయాక మాటాడుకుందాం.

బా చెప్ప ఫరవాలేదు. భోజనానికీ మాట లకీ సంబంధమేమిటి? రెండూ చెయ్యొచ్చు

జా ఒద్దు లెద్దురూ. అసలే ఏమిటోచిరాగ్గా ఉన్నాం అన్నాలదగ్గిరయినా కాస్త శాంతంగా ఉందాం. మాటలు ఎంత తగ్గిస్తే అంతమంచిది

బా వారెవాఁ! జానకికూడా యిలా మారి పోయి వేదాంతి అయిపోతే, యిక ప్రపంచం ఏంగాను... నీ ఆరోగ్యానికి అసలు మౌనం పడదే!

జా నా వాగుడు యింకొకరి ఆరోగ్యానికి పడడంలేదు ఎలాగ?

బా ఈ ధర్మ జిజ్ఞాస యింతటితో కట్టేసి, ముందు భోజనం చేద్దాం కడుపునిండితే కాస్త లోకం ఆనందమయంగా కనబడి—

ల (ప్రవేశిస్తూ) కనబడకేం! ఇప్పట్లో మీకు లోకం చాలా ఆనందమయంగా కనబడు తుంది మరి వడ్డించేశాను, వస్తారా—యింకే మైనా ఆలస్యం ఉందా? ఏం జానకీ? అన్నాని కొస్తావా? చలికాలం రాత్రి. వడ్డించు. పని త్వరగా అయిపోతే-ఆనక మీ యిష్టం. తెల్లార్లూ కూర్చుని కబుర్లు చెప్పుకోండి.

బా ధోరణి యిలా మారిందేం లక్ష్మీ? నీ మనస్సులో ఏముందో స్పష్టంగా చెప్పరాదా పోనీ?

ల: మారింది నేను! ఎవరు మారారో తెలు స్తూనే ఉంది. ఎందుకు నన్నిలా బాధ పెడ తారు? ఇప్పుడు నేనేం అన్నానని? పోనీ—మీ రెప్పుడొస్తే అప్పుడే వడ్డిస్తాను—సరేనా—

బా· (నిట్టూర్పుగా) హుఁ, పద. పద, జానకీ.

జా. నేనూ సిద్ధంగానే ఉన్నాను. ఆలస్యం నాదా అక్కయ్యా?

ల అబ్బే....నేనలా అన్నానా? నువ్వు సిద్ధంగానే ఉన్నావు నాకు తెలీదూ? ఎటొచ్చీ బావగారే ఆలస్యం చేస్తున్నారు-పాపం. ఎందు కొచ్చిన సోదె. నన్నిలా బతకనివ్వండి. అంతే చాలు. .లేచి కాళ్లూ చేతులూ కడుక్కోండి.

జా: అంతకంటె మనస్సులూ, హృద యాలూ కాస్త కడుక్కుందికి వీలుంటే భాగుం డును పదండి బావగారూ........అన్నట్టు అక్కయ్యా....సాయంత్రం పువ్వులమ్మి పువ్వు లిచ్చిందా?

ల: ఆఁ....వాటి ఊసే మరిచిపోయాను. పోనీలే. ఇంతలో ఏం పోయింది? ఇప్పుడదొక్కటే తక్కువ.

బా: ఒద్దులే. పువ్వులూ వద్దు, చిరు నవ్వులూ వద్దు బుర్రలోని ముళ్ళూ, చీకటీ అవే మనకి అలంకారం, పద

*     *     *

(సన్నగా ఫిడేల్ వాద్యం వినబడుతుంటుంది)

ల దయచేసి ఇంక ఆ రేడియోకట్టేసి పడు కుంటారా? నాకు నిదరొస్తోంది మళ్ళీ పొద్దున్నే లేచాక బోలెడంత చాకిరీ.

బా నువ్వలా అంటావనే సన్నగాపెట్టాను

జా· కట్టేద్దురూ బావగారూ ఉండక్కయ్యా నేను కట్టేస్తాను.

(ఫిడేల్ వాద్యం ఆగిపోతుంది)

సరేనా అక్కయ్యా ఇంక నేనుపోయి పడుకుంటాను. నాకూ ఏవిఁటో అలసటగా ఉంది ఒక్కమాట వినేసి నిద్రపో అక్కయ్యా అనక మళ్ళీ ముందు చెప్పలేదంటావు

ల ఏమిటది?

జా రేపు నేను ఊరెళ్ళిపోతున్నాను పాసింజరుకి

బా· రేపే? అదేవిఁటది?

జా· అదంతే వెళ్లిపోవాలి

ల పెట్టిన సెలవు ఇంకా ఉందిగా?

జా· ఉంది ఇంకా ఓ వారం రోజులుంది

ల అయితే అప్పడే అంత తొందర దేనికి?

జా. ఏమిటో వీటన్నిటికీ కారణాలు చెప్పడం నావల్లకాదు వెళ్ళిపోవాలనిపిస్తోంది మనస్సు మళ్ళాక యింక ఉండడం కష్టం.

ల అంత చంచలమైన మనస్సు అన్న మాట నీది!

జా అలాగే అనుకో అక్కయ్యా, ఏం చేస్తాంమరి! అందరికీ నిశ్చలమైన మనస్సులూ, నిర్మలమైన నడవడికలూ ఉంటాయా? లోకంలో అంతా మహర్షులే అయితే ఏందారి? నాలాంటిదానికి కూడా కాస్త చోటుండాలి మరి.

ల అంత వేదాంతం నాకు తెలీదు నేనేం నీ అంత చదువుకున్నదాన్ని కాదు నీ అంత తెలివైనదాన్నీ కాదు. వారంరోజు లింకా శెలవుంది గదా-అప్పడే ప్రయాణం దేనికన్నాను. ఏమండీ....మీరే మంటారేం?

బా మధ్య నేనేం మాటాడను? వెళ్లాలని ఉన్నప్పుడు మనం బలవంతం చేస్తేమట్టుకు ఏం ప్రయోజనం? వెళ్లనీ.

ల నేనేం బలవంతం చెయ్యమనడంలేదు ఇంతకూ నా బలవంతాలు ఎవరికి కావాలీ? మీకూమీకూ ఏది యిష్టమైతే ఆ ప్రకారం చెయ్యండి అంతేగాని నా మీద నిష్ఠూరాలు వెయ్యద్దు ఇందాకా మీరేదో ఆనందాలు అన్నారే—నేనెవరి ఆనందాలకీ అడ్డు రాదలచుకోలేదు మధ్య నేనెవతెను?

బా నీ ఆత్మత్యాగం మెచ్చుకోతగిందేగాని—స్తుతం అంత త్యాగం అనవసరం. సరేలే జానకీ....రేపు ఉదయం పాసింజరుకి గదూ అన్నావూ...

జా అవును, అదే సుఖంగా ఉంటుంది. దీపాలు పెట్టేవేళకి ఊరు చేరుకోవచ్చు

బా మంచిది. సామాను సర్దుకో

జా ఇంతోటి సామానూ—సూటుకేసూ—బెడ్డింగూ ఇవే కదూ!

ల అయితే వెళ్లడం నిశ్చయమే నన్నమాట . ఏం జానకీ?

జా వెళతానక్కయ్యా .... వెళ్లనీ దీన్ని కూడా వాదనలోకి దింపి మనస్సులు మరింత పాడుచేసుకోవద్దు ఒస్తూనే ఉంటానుగా.

ల సరే, నా త్యాగాలు మీకెలాగ అక్కరలేదో—మీ త్యాగాలూ నాకు అక్కరలేదు అదొక్కటి జ్ఞాపకం పెట్టుకోండి. అంతే

బా ఇంక పడుక్కుందాం జానకీ. నీ గదిలోకి నువ్వు వెళ్ళు తక్కిన విషయాలు పొద్దున్న చూసుకోవచ్చు

జా: ఆల్‌రైట్ మనబోటివాళ్ళకి యీ ప్రపంచంలో మిగిలిన ఒక్క సుఖమూ నిద్ర. పోయి చూస్తాను కలలైనా మంచివొస్తాయేమో

బా హుఁ....వాటిమీద ఆశ పెట్టుకోకు. తీరా అవి పీడకలలైపోతాయి

జా అంతేనా....అప్పడు పగలూ, రాత్రీ, మెలుకువా నిద్రా, అన్నీ ఒక్కలాగే ఉంటాయన్నమాట. భయంలేదు కానివ్వండి....నే వెళ్తున్నాను

*  *  *

బా లక్ష్మీ!

ల· ఏం?

బా: నిద్రొస్తోందా?

ల వస్తోంది నేనేం కలలకోసం ఎదురుచూడ్డం లేదులెండి.. ఏం?

బా ఒక్క క్షణం కాస్త మనసిచ్చి మాటాడతావా?

ల· ఇప్పడేఁవొచ్చింది?

బా ఏమీ రాలేదు ఎటొచ్చీ మనందరికీ నరకం అంటే ఎంత ప్రేమో, అల్పత్వమంటే ఎంత యిష్టమో - రుజువు చేసుకుంటున్నాం. అంతే.

ల: ఏమిటో - మీరు మాటాడే భాష నా కర్థం కాదు.

బా అంతేలే. పోనీ ఆ గొడవంతా దేనికి? రెండు మూడు రోజులై నువ్విలా ఉన్నావేం?

ల ఎలా ఉన్నాను? మామూలుగానే ఉన్నాను.

బా అబద్ధం.... తోడబుట్టిన చెల్లెల్ని నువ్వు శూలాల్లాంటి మాటలంటున్నావంటే—

ల తోడబుట్టిన చెల్లెలే నా కాపరంలోఅశాంతి లేపడానికి ప్రయత్నిస్తోంది. అది బాగుందా?

బా హరహర! మా యిద్దరి చనువూ నీ కలా అర్థం అయిందన్నమాట అంతేనా?-

ల: జాలిపడ్డాను రక్తం పంచుకొని పుట్టిన చెల్లెలు గదా అని ఆదరించాను. పాపం యీ ప్రపంచంలో నా అన్నవాళ్ళు దాని కెవరైనా ఉంటే ఒక్క నేనే! ఒంటరిఆడది, ఏదో ఉద్యోగం చేసుకు తన బతుకు తాను బతుకుతోంది — కాస్త నట్టింటో నాలుగు రోజులు ఉంటుంది కులాసాగా అని సెలవు పెట్టి రమ్మన్నాను—

బా రమ్మంటే - వచ్చి నీతో పోటీ పడింది అవునా?

ల నేనామాత్రం అర్థం చేసుకోగలను. నన్ను మభ్యపెట్టడానికి ప్రయత్నించకండి. నాబోటి అమాయికురాలిని క్షోభ పెడితే మీకే మొస్తుంది?

బా పాపం, నారీధర్మం గుత్తకి పుచ్చుకున్న దానివి. అర్థం చేసుకోగలనన్నావు-ఏం అర్థం చేసుకున్నావు? జానకే నీకు గనక అర్థం అయితే, నువ్వు యిలా ప్రవర్తించేదానివా?

ల సరేగాని ముందు యిది చెప్పండి. కాస్సేపు జానకి తరఫున వకాలతు మానేసి దీనికి సమాధానం యివ్వండి జానకికే గనక పెళ్ళయి ఉండి, ఆ భర్త యిప్పుడిక్కడ ఉండుంటే నాలాగే బాధపడేవాడా లేదా?

బా మంచి ప్రశ్నవేశావు. వాడూ నీలాంటి మనస్తత్వం మనిషే అయితే తప్పకుండా బాధపడేవాడు.

ల మీలాంటి వాడయితే సంతోషించేవాడనుకుంటాను

బా· విధిగా; జానకి నీతోడబుట్టువైనా నీకు సరిగా అర్థంకాలేదు. ఆమెలో కల్మషం ఎక్కడా లేదు ఎప్పుడూ వంకరదారుల్లో నడవదు ఆ మాత్రం పోల్చుకోలేకపోవడం నీ లోపం

ల మొన్నటిదాకా నేనూ అలాగే అనుకున్నాను. కాని—

బా ఇప్పుడు అభిప్రాయం మార్చేసుకున్నావన్నమాట

ల మనుషులు మారితే అభిప్రాయాలు మారవూ మరి?

బా ఇలా ఎన్నాళ్లు మాటాడినా ఎక్కడికీ తేలం నీడల్ని చూసి భయపడినన్నాళ్లు మనకి నిజం కనబడదు. అంతేగాదు. ఎవరైతే మనకి ఆప్తులో వాళ్ళనే బాధపెట్టి వాళ్లకే అన్యాయం చేస్తాం. ఇంకెవరినో సంతృప్తిపెట్టడానికి ప్రయత్నించి, లేదా మనలోని యీర్ష్యలకీ అల్పత్వాలకీ లొంగిపోయి, ఎవరు మనకి నిజంగా కావలసినవాళ్లో నిజంగా వాళ్లకే దూరంఅయిపోతాం.

ల ఇప్పుడు నన్నేం చెయ్యమంటారో చెప్పండి పోనీ

బా జానకిమీద లేనిపోని దురభిప్రాయాలు పెంచుకోవద్దంటాను. అంతే. ఇంకా వార్ధంరోజులుండాలని వచ్చింది. పాపం-రేపే వెళ్ళిపోతానంటోంది ఎంచేతో ఆలోచించావా? నీ యీర్ష్య మూలాన. దీనివల్ల ఆఖరికి నష్టపడేది నువ్వే కాని ఆమె కాదు. ఎంచేతంటే-నీలాగ జానకికి బతకడం అంటే భయంలేదు అస్తమానం కూర్చొని నీకున్న అదృష్టాలేవో పోతాయని భయపడుతూంటావు నువ్వు. ఎవరో నీ దగ్గర నించి లాక్కుంటారని అనుక్షణం వణికిపోతూ ఉంటావు అంచేత ఎవర్ని దగ్గరగా రానివ్వవు. నువ్వు ఎవరికీ దగ్గరగా వెళ్లవు జానకి అలా కాదు ఆమెకి యివ్వడమూ తెలుసు, అంచేత తీసుకోవడమూ తెలుసు

ల· నాకదంతా తెలియదు, ఒకరు నాకేదీ యివ్వనూవద్దు, నా దగ్గిరనుండి ఏదీ అడగనూ వద్దు నన్నిలా వదిలేస్తే చాలు. మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి-ఎవరి హద్దుల్లో వాళ్లు ఉండాలని నా నమ్మకం వెళ్ళనివ్వండి రేపు-

ఇంతలో మించిపోయిందేమీలేదు. మళ్ళీ వచ్చినప్పుడు కాస్త బుద్ధిగలిగి ఉంటుంది....ఇంక వెళ్ళి పడుకోండి. నాకు నిద్దరొస్తోంది. జానకితో పాటు మీరుకూడా కలలు గనండి.

* * *

జా· (స్వప్నకంఠంతో) ప్రతి రాత్రికీ ఉషఃకాలం అంటూ చివర్న ఉంటుంది. తరవాత పగలు, అదే మళ్ళీ రాత్రిగా మారుతుంది. రాత్రి సుఖంగా నిద్రపోతే, పీడ కలలేమీ రాకపోతే, ఉదయాన అన్నీ హాయిగా, మంచిగా కనబడతాయి. సాయంత్రాలు హాయిగా నవ్వు కోగలం అలా నవ్వుకోగల్గినప్పుడు సంధ్యా సమయంలో మనకి దివ్య సంగీతం వినబడుతుంది ఎటొచ్చీ అది వినగల్గడానికి మనకి చెవులకంటె ముఖ్యం హృదయం. దానినే వినగల్గితే అంత వరకూ మానవత్వం కూడా లోపించిన మనం అమాంతంగా దేవత్వాన్ని అందుకుంటాం. అప్పుడు ఒకరినొకరు మాట లక్కరలేకండా అర్థం చేసుకోగలం కాని మళ్లీ చీకటి పడిపోతుంది మన భాషలకీ అర్థం చెరిగిపోతుంది అప్పుడే పీడకల లారంభం. అప్పుడే ఒంటరితనం ఆరంభం. ఎంత మందిలో ఉన్నా మనల్ని ఒంటరితనం పీడిస్తుంది అందుకోసం, ఒంటరితనాన్నీ చీకటినీ పారదోలడంకోసం దీపాలు వెలిగిస్తాం రకరకాల దీపాలు. కొవ్వు దీపాలు, నూనె దీపాలు.... విద్యుద్దీపాలు. కాని లాభంలేదు. పీడకలలు చెదిరిపోవు అప్పుడు ఎవర్ని చూసినా, దేన్ని చూసినా భయంవేస్తుంది అనురాగం—అభిమానం, ప్రేమ, వాత్సల్యం, అన్నీ మనల్ని భయపెడతాయి. ఆ ఘడియల్లోనే, తల్లీ, తండ్రీ భర్తా, భార్యా, అన్నా, చెల్లెలూ, నెచ్చెలీ, చెలికాడు—అందర్నీ చూసి భయపడి అసహ్యించుకుంటాం. తెల్లారుతుంది. ఆ అసహ్యాలు, భయాల మరకలన్నీ మన మొహాల్లో మిగిలిపోతాయి. పిన్నీ ఒదినా బాబాయ్ చెలికాడా నెచ్చెలీ అని పిలుచుకుంటాం కాని లాభం లేదు. మన పిలుపు మనకే అబద్ధంగా వినిపిస్తుంది. అంచేతనే రాత్రే మనకిపారశాల రాత్రే దేవాలయం—రాత్రే మనకి జననం మరణం.

ల (ఏదో పీడకల వచ్చినట్లు పెద్దగా అరుస్తుంది )

బా. (కంగారుగావస్తూ) ఏమిటది ఏమిటది లక్ష్మీ?

జా (అలాగే కంగారుపడుతూ) ఏవిఁటది? అక్కయ్యా అరిచింది? అక్కయ్యా, అక్కయ్యా.

ల· (భయపడుతూ) హమ్మయ్య, నువ్వేనా జానకీ....హమ్మయ్య....బతికిపోయాను ఏమండీ కాసిని మంచినీళ్ళిస్తారా?

బా తెస్తానుండు....ఇంద. ఏమైంది లక్ష్మీ ఏమైంది?

ల (నీరసంగా) ఏమైందో నాకే సరిగ్గా తెలియడంలేదు

జా ఏం జరిగిందక్కయ్యా! ఎందుకు వణికి పోతున్నావ్?

ల కలొచ్చిందే! ఎంత పాడుకల అనుకున్నావ్?

జా కలకే అంత భయపడిపోతే ఎలాగక్కయ్యా? ఏదో పీడకల వచ్చి ఉంటుంది. మనందరికీ వస్తాయి—పీడకలలు. దానికేం?

బా హడలగొట్టేశావ్ లక్ష్మీ! ఎలా అరిచావ్ తెలుసా?....పోనీలే....కాస్సేపు అలా మేలుకుని కూర్చో. అదే తేరుకుంటుంది. ఇంతకూ ఏవిఁటా కల?

ల తెల్లారేక చెపుతా లెండి. ఇంక మీరు వెళ్ళి పడుకోండి. అనవసరంగా మీ నిద్ర పాడు చేశాను. జానకీ....కాస్త నా దగ్గరగాకూర్చో.... మీరు వెళ్ళరూ? కాస్త. మళ్ళీ పిలుస్తానులెండి!

బా· అక్కా చెల్లెళ్ళ ఏకాంతమా? సరే. (వెళ్లిపోతాడు )

ల జానకీ! ఎంత పాడుకల అనుకున్నావ్? చెప్పడానికి కూడా భయంవేస్తోంది కల్లో నువ్వు పదేళ్ళ చిన్నపిల్లవట. ఇద్దరం కలిసి అలా అలా వెళుతున్నామట—అడవులూ, కొండలూ అన్నీదాటి నువ్వు ఏమిటేమిటో చెపుతూ నా చెయ్యిపట్టుకు నడుస్తున్నావట. ఉన్నట్టుండి నేను నీ పీకపిసికి పాడుబావిలో పడేశానుట. అప్పుడు నువ్వు అరిచావట ఆ అరుపువినే నేను భయపడ్డాను తీరాచూస్తే నేనే అరిచానన్న మాట....

జా· ఎంతచిత్రం! నాకూ యించుమించు అలాంటి కతే ఒచ్చింది. ఆ కల మధ్యలోనే నీ కేక వినబడింది.

ల: నా కేమిటో భయంగా ఉంది జానకీ! కలలోఅయినా అలాంటి కీడు నీకు రావడం నేను సహించలేను.

జా: నీకేం భయంలేదక్కయ్యా.... ఇదెందుకో వచ్చిందిలే. కలలకి అర్థంఏమిటి? కలలో అయినా మనం ఒకరికొకరం అపకారం తలపెట్టగలమా?

ల· జానకీ! ప్రయాణం మానేసి యీ వారం రోజులూ ఉండిపోకూడదూ? ఉండిపోజానకీ! ఉండవా?

జా: తప్పకుండా ఉంటాను అక్కయ్యా! ఎందుకుండనూ? ఆమాటకొస్తే యింకో నెల రోజులు సెలవుపెట్టేసి మరీ ఉంటాను.

ల నీలాంటి చెల్లెలుంటే నాకింకేంగావాలి? లేచివెళ్ళి కాఫీ పెట్టుకుందామా?

జా పాలు ఉన్నాయా?

ల· పోనీ - ఒర్రి డికాక్షనే తాగేద్దాం. ఏం? బావగారికి కూడా కాస్త ఓ గ్లాసుడు యిద్దాం. (బిగ్గరగా) ఏమండోయ్! ఓ సారిలాగ రండీ!

బా (ప్రవేశిస్తూ) ఏం మళ్ళీ ఏం కావాలి?

ల· పాలు లేకండా ఉత్త కాఫీ డికాక్షన్ యిస్తాం తాగుతారా?

బా ఓ! దానికేం!

జా (నవ్వుతూ) మనిద్దరం ఒక్కటై, విషంతాగమన్నా బావగారు అమృతప్రాయంగా తాగేస్తారు... ఏం బావగారూ?....అంతేనా?

బా నీ చెయ్యి తగిలితే విషం కూడా అమృతంగా మారిపోతుంది జానకీ!

(అందరూ నవ్వుకుంటారు.)

[ఆలిండియా రేడియో ప్రసారితం]

---

(33 వ పేజీ తరువాయి)

తుంది. 'నారు పోసినవాడు నీరు పోయలేడా? దేశానికి స్వరాజ్యాన్ని తెచ్చిన కాంగ్రెసు సోషలిజాన్ని సాధించలేదా?' ఇంత బలమైన తర్కము ప్రజల్లో కాంగ్రెసు కలుగజేసిన తరువాత చేతులు కాల్చుకుని ప్రయోజనమేమున్నది ప్రజల మనస్సులను చైతన్యవంతము జేయుటకు మార్గాలు అన్వేషించాలి. అందుకు ప్రజల్లో తీవ్రమైన రాజకీయ చైతన్యము కలుగజేయగల పార్టీ అవసరము. కాంగ్రెసుతో దేశమంతా అన్ని సీట్లకు ముఖాముఖి పోటీ చేయవచ్చు. అంత మాత్రాన కాంగ్రెసుకు వ్యతిరేకమైన ప్రజలందరు ప్రతిపక్షానికి వోట్లు వేస్తారనుకోవడము భ్రమ.

ఎన్నికల్లో పోటీలంటే ఉత్సాహపడి రంగములోనికి వచ్చే వ్యక్తులకు పార్టీలకు ఈ దేశంలో కొదవలేదు హడావిడిగా ఈ ఎన్నికల సర్దుబాట్లకన్నా శాశ్వతమై ప్రతిపక్ష పార్టీ నిర్మాణమునకు పునాదులు వేయాలి. ఈ సర్దుబాట్ల వల్ల రాజకీయ అవకాశవాదము, అవినీతి, కలుషిత రాజకీయ వాతావరణము ఏర్పడగలదు. అధికార వ్యామోహము పెరిగి అధికారములోనికి వెళ్ళుటకు అడ్డదారులను అన్వేషించే మనస్తత్వ మేర్పడగలదు. ప్రమాదకరమైన ఈ ఫలితాలను గమనించినప్పుడు కేవలం ఈ ఎన్నికల సర్దుబాట్లవల్ల లాభముండదు.

"ఆయా నియోజక వర్గములో సరిపడిన పార్టీ సభ్యత్వము, యూనిట్లు కలిగియున్నప్పుడే ఆ పార్టీ ఆ నియోజకవర్గములో పోటీ చేయాలి ప్రజావుద్యమ నిర్మాణంద్వారా ప్రజానాయకత్వ పార్టీగా ఆ పార్టీ ప్రయత్నం గుర్తింపబడి యుండాలని" భారత సోషలిస్టుపార్టీ కోరుతోంది. అక్షర భేదముతో ప్రజా సోషలిస్టు పార్టీకి ఇలాంటి సూత్రము లున్నవిగాని ఆచరించే ఉద్దేశము వారికి లేదేమో!

ప్రజల్లో రాజకీయ చైతన్యము కలుగజేయుటద్వారా ప్రజా ఉద్యమాన్ని నిర్మించి పటిష్టమైన ప్రతిపక్షమును రూపొందించాలి. తద్వారా ప్రభుత్వములోనికి ఆ పార్టీని పంపుటకు ప్రజలను సన్నద్ధపరచాలి. అంతవరకు ప్రతిపక్షాలకు మోక్షంలేదు. అంతవరకు మనకు ఈ అయోమయపు రాజకీయాలు తప్పవు. ★

Source: Press Academy Website, Telugu Swatantra, 1957

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/